సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం ౹ 11 ౹ మే ౹ 2025



వేగంగా 'టర్ఫ్' పనులు

పాలమూరు ఎండీసీఏ క్రికెట్ మైదానంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వివరాలు 10లో ▸



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8 /22.6

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. సాయంత్రం వర్షం పడే అవకాశం ఉంది.

అమ్మా.. నీకు వందనం

తొలి గురువుగా అందరికీ స్ఫూర్తి

- అమ్మ మాట.. బంగారు బాట..
- తల్లి ప్రోత్సాహంతో జీవితంలో ఎదిగిన వారెందరో..



సృష్టికి ప్రతి రూపం అమ్మ..
పిలిచే తియ్యని పిలుపే అమ్మ..
ప్రాణం పోసే దేవత అమ్మ..
కన్నపేగు గుండెచప్పుడు అమ్మ..
మమతల ఒడి.. త్యాగాల గుడి.. తొలిబడి అమ్మ..
అమితమైన ప్రేమ.. అంతులేని అనురాగం..
అలుపెరగని ఓర్పు.. మాటల్లో వ్యక్తపరచలేని భావం..
చేతల్లో ప్రదర్శించలేని భాష్యం..
అందుకే అమ్మకు సాటి అమ్మే.. అమ్మకు మించిన దైవం లేదంటారు. నేడు మాతృదినోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు వారి అమ్మ ప్రేమను గుర్తు చేసుకున్నారు.

- సాక్షి, నాగర్‌కర్నూల్/పాలమూరు/వనపర్తి/గద్వాల/జెడ్పీసెంటర్

నేడు మాతృదినోత్సవం

తల్లి ప్రేమ మారదు..



కూతురుతో ఎస్పీ డి.జానకి

ఉద్యోగరీత్యా మా పాపకు కొంత దూరంగా ఉండాల్సి వస్తోంది. ఎలాంటి సందర్భంలో నీకు దూరంగా ఉన్నా అనే విషయం చెబితే మా అమ్మాయి అర్థం చేసుకుంటుంది అని చెప్పుకొచ్చారు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి. మాకు ఒకే ఒక్క కూతురు హైదరాబాద్‌లో 8వ తరగతి చదువుతుంది. విధుల్లో భాగంగా నేను మహబూబ్‌నగర్‌లో ఉంటాను. సెలవులు వస్తే ఆమె ఇక్కడి రావడం.. లేదా వారంలో ఒకరోజు నేను అక్కడికి వెళ్లడం చేస్తాను. అప్పటికీ.. ఇప్పటికీ.. ఎప్పటికైనా పిల్లలపై చూపే తల్లి ప్రేమ, వాత్సల్యంలో ఎలాంటి మార్పు ఉండదు. గతంలో జనరేషన్‌కు ఇప్పటి పిల్లలకు చాలా వ్యత్యాసం ఉంది. ఇప్పుడు సాంకేతికపరంగా టెక్నాలజీ అందుబాటులో ఉండటం వల్ల చాలా విషయాలు అర్థం అవుతున్నాయి. భవిష్యత్ పరంగా ఎలా ఉండాలి.. ఇతర అంశాలపై చర్చించడం చేస్తాను. చదువులో కూడా ఏదైనా సందేహాలు, సలహాలు ఇస్తాను. అమ్మాయికి దూరంగా ఉన్నా.. నిత్యం ఫోన్ ద్వారా యోగక్షేమాలు తెలుసుకుంటాను.

తల్లికంటే ముఖ్యులు ఎవరూ ఉండరు..

'నా చిన్నతనం నుంచి మా అమ్మ శోభ నాకు అన్ని రకాలుగా ప్రోత్సాహంగా నిలిచారు. మా అన్న, చెల్లెలితో పాటు నన్ను బాగా చదువుకునేలా ప్రోత్సహించారు. ప్రతీ ఒక్కరి జీవితంలో తల్లి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆమెకన్నా ముఖ్యమైన వారు మన జీవితంలో ఎవరూ ఉండరు. నాకు సమయం కుదిరినప్పుడల్లా అమ్మ, నాన్న, కుటుంబసభ్యులతో గడుపుతాను. తల్లులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు.

- వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్



తల్లి శోభతో నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్

అమ్మ లేకుంటే నేను లేను





మణెమ్మ, అదనపు కలెక్టర్ తల్లి

సృష్టిలో అమ్మ పాత్ర గురించి వివరించేందుకు, వర్ణించేందుకు ఏ భాష సరిపోదు. అయితే నా వరకు మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. మా సొంత గ్రామం అప్పారెడ్డిపల్లి వనపర్తి జిల్లా. అమ్మ మణెమ్మ, నాన్న బుచ్చన్న. మేము ఐదుగురం సంతానం కాగా.. ఇద్దరం మగ పిల్లలం, ముగ్గురు ఆడపిల్లలు. మాది వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ మా నాన్న ప్రధానంగా కులవృత్తి వడ్రంగి పనిచేసేవారు. నేను పదో తరగతి అయిపోయిన తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరాలనుకున్నాను. కానీ, అప్పట్లో కులవృత్తికి బాగా డిమాండ్ ఉండడం, మాది పెద్ద కుటుంబం కావడం.. ఇంట్లో నేనే పెద్ద కుమారుడిని కావడంతో మానాన్న పదో తరగతిలోనే ఆపేసి వండ్రంగి పని నేర్చుకోవాలన్నారు. అయితే మా అమ్మ చదువుకుంటేనే విలువ ఉంటుందని, నన్ను ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. అలా అమ్మ ప్రోత్సాహంతో ఇంటర్, డిగ్రీ, ఉన్నత విద్య పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే మా అమ్మతో పాటు నాన్న ప్రోత్సాహం కూడా ఉంది. ఇప్పటికీ శనివారం, ఆదివారం వచ్చిందటే చాలు పెద్దోడ ఇంటికి వచ్చివెళ్లు అంటుంది. అంత ప్రేమ పంచడం సృష్టిలో ఒక్క అమ్మకే సాధ్యం. పిల్లలు ఎంత ఎదిగినా తల్లి దృష్టిలో చిన్నపిల్లలే. అందుకే మనకోసం కష్టించే అమ్మకు మనం పెద్దవారం అయిన తర్వాత గౌరవించి బాగా చూసుకుంటే వారికి అదే చాలు.

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్, జోగులాంబ గద్వాల

నా కెరీర్‌లో రోల్ మోడల్



తల్లితో వనపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమ్మను తొలి గురువుగా భావించి ఆదర్శంగా తీసుకుని సివిల్ సర్వీసెస్ లక్ష్యం నిర్దేశించుకున్నా. వెన్నంటే ఉంటూ ఎంతో ప్రోత్సాహం అందించి నేడు సమాజంలో గౌరవ ప్రదమైన కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించేందుకు సహకారం అందించారు. నా లైఫ్‌లో ప్రతి ముఖ్యమైన ఘట్టంలో మా అమ్మ నర్సమ్మ పాత్ర చాలా కీలకం. ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో.. ఐదో తరగతి నుంచి ఢిల్లీలో చదువుకునేందుకు అమ్మ తన ఉద్యోగ బాధ్యతలను నా కోసం పదేళ్లపాటు ఢిల్లీకి మార్చుకున్నారు. నా జీవిత లక్ష్యం సాధించేందుకు ఎంతగానో మార్గనిర్దేశనం చేశారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన మా అమ్మ పట్టుదలతో ఉన్నత చదువులను అభ్యసించి ఆదాయపన్ను శాఖ అధికారిగా కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. నా కెరీర్‌లో రోల్ మోడల్‌గా నిలిచారు. చిన్న వయస్సు నుంచే ప్రతి విషయంలో మార్గదర్శనం చేస్తూ.. జీవిత లక్ష్యం సాధించుకునేందుకు వెన్నంటి నడిపించారు. మారుమూల ప్రాంతమైన ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం గ్రామంలో కానిస్టేబుల్ కుటుంబంలో పుట్టారు. మా నాన్న సురభి సత్యన్నతో జీవితాన్ని పంచుకునేందుకు తెలంగాణ ప్రాంతంలోని కరీంనగర్‌కు వచ్చారు. నాన్న రాష్ట్ర సర్వీసుల్లో జాయింట్ కలెక్టర్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. మా కుటుంబ ఉన్నతి కోసం మా అమ్మ ఎంతగానో కృషి చేశారు.

- ఆదర్శ్ సురభి, కలెక్టర్, వనపర్తి

అమృత పదం అమ్మ



పదాలు తెలియని పెదవులకు అమృత పదం అమ్మ. అమృతం ఆయుష్షు పోస్తుందో.. లేదో.. తెలియదు కానీ, అమ్మ మాత్రం తన ఆయుష్షును సైతం బిడ్డకు అందిస్తుంది. నిండునూరేళ్ల ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటుంది. నవ మాసాలు కడుపులో కదలాడే తన బిడ్డను కంటిపాపలా చూసుకుంటుంది. ప్రసవ సమయంలో నరకం అనుభవిస్తూనే తన బిడ్డ క్షేమం కోసం పరితపిస్తుంది. తన పిల్లలే లోకంగా జీవించే తల్లి రుణం తీర్చుకోలేం. అమ్మ మన రేపటి భవిష్యత్ కోసం నిత్యం శ్రమించే శ్రామికురాలు. ఈ తల్లుల దినోత్సవం జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ.. అమ్మలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.

- విజయేందిర, కలెక్టర్, మహబూబ్‌నగర్

న్యూస్‌రీల్

రేపు అప్రెంటీషిప్ మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని యువత కోసం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీషిప్ మేళాను ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి శాంతయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా నిర్వహిస్తారని, ఇందులో 20 కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌ఫొటోలతో రావాలని సూచించారు.

ప్రశాంతంగా టీజీఆర్జేసీ ప్రవేశ పరీక్ష



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ గురుకులాల్లో ఇంటర్మీడియట్ కళాశాలల సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం శనివారం ప్రవేశ ప్రవేశ పరీక్ష నిర్వహించింది. వివిధ గ్రూప్‌లకు సంబంధించి జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12,233 మంది విద్యార్థులకు 10,647 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 1,586 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 87 శాతం విద్యార్థులు హాజరయ్యారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని తల్లిదండ్రులు, విద్యార్థులు పేర్కొన్నారు. తాగేందుకు నీళ్లు, నిలబడేందుకు కనీసం నీడలేకపోవడంతో రోడ్డు పొడువున చెట్ల నీడలో సేదతీరాల్సిన వచ్చింది.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌పీవెంకటేశ్, రాజశేఖర్, తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నిరంతరం ప్రాక్టీస్‌తో క్రీడల్లో ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని, జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీవెంకటేశ్ అన్నారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెటర్లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇటీవల ఐపీఎల్‌లో బిహార్ యువ క్రీడాకారుడు వైభవ్ 35 బంతుల్లో సెంచరీ చేశాడని, ఆయనను పీఎం మోదీ ప్రశంసలు కురిపించారని గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదు ప్రాంతాల్లో నెలరోజుల పాటు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు ఇస్తున్నారని, విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది వేసవి క్రికెట్ శిబిరాలకు ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఏడాది వేసవి శిబిరాల్లో మొదటిసారి ఇంట్రా టోర్నమెంట్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని క్రీడాకారులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడాకారులకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు, ఇంట్రా టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. త్వరలో మహబూబ్‌నగర్‌లో అండర్-19 లేదా అండర్-16 జాతీయస్థాయి టోర్నమెంట్ నిర్వహించడానికి హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ హామీ ఇచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంలో ఒక బాలికల టోర్నమెంట్ కూడా నిర్వహిస్తామని అన్నారు. బాలికలకు ప్రత్యేక క్రికెట్ శిక్షణ అందజేస్తామని తెలిపారు. ఈ సారి ప్రత్యేకంగా టర్ఫ్ వికెట్‌పై 14 జట్లతో మహబూబ్‌నగర్ ప్రీమియర్ లీగ్‌ను జూలైలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కార్యదర్శి రాజశేఖర్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, ఎండి.మన్నాన్‌తోపాటు సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, ఆబిద్ పాల్గొన్నారు.

'ఆర్‌అండ్‌ఆర్' పెంపుపై త్వరలో శుభవార్త



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంపునకు సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఆర్‌అండ్‌ఆర్ పెంపునకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, త్వరలోనే ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్థికశాఖలో ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని, ఆమోదం పొందిన వెంటనే పరిహారం పెంపునకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరామన్నారు. రిజర్వాయర్ పనులతో పాటు కాల్వల నిర్మాణపనులను కూడా వెంటనే చేపట్టాలని ఇందుకు సంబంధిచి టెండర్లు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. కోడ్గల్, బైరంపల్లి, వాడ్యాల గ్రామాల పరిధిలో దుందుభీ వాగుపై చెక్‌డ్యామ్‌లను నిర్మించాలని కోరామని పేర్కొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ ధర రూ. 2083

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌యార్డులో శనివారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,083, కనిష్టంగా రూ.1,801గా నమోదయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.1,779గా ఒకే ధర లభించింది. సీజన్ తగ్గడంతో మార్కెట్‌కు నాలుగు వందల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

సోలార్ పనులు వేగవంతం

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో సోలార్ విద్యుత్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ప్లానింగ్‌బోర్డు ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, విద్యుత్‌శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖ్ అన్నారు. శనివారం ఉదయం గ్రామంలోని ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లను వారు పరిశీలించి విద్యుత్ సరఫరా వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 482 ఇళ్లుండగా.. 412 ఇళ్లపై సోలార్ ప్లేట్లు బిగించామని, మిగతా 70 ఇళ్ల పైకప్పు మట్టి, రేకులు ఉండటంతో మిగిలిపోయినట్లు అధికారులు వారికి వివరించారు. మట్టి మిద్దెలు ఉన్న ఇళ్ల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేయాలని రెడ్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. పైలెట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లిలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అన్ని పనులు పూర్తయితే ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. వారి వెంట రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, గ్రామస్తులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

క్రమబద్ధీకరణకు నిరీక్షణ!

- ఎంపీడీఓ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు
- పెంచిన వేతనాలు తగ్గించిన ప్రభుత్వం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని 16 మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్న 33 మంది కంప్యూటర్ ఆపరేటర్లు తమ సర్వీస్ క్రమబద్ధీకరణకు ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని కొంతకాలంగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. 2015 సంవత్సరం నుంచి జిల్లాలో ఒక్కో కార్యాలయంలో ముగ్గురు చొప్పున 33 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా ప్రారంభంలో రూ.6 వేల వేతనంతో విధుల్లో చేరారు. కాగా వీరి వేతనాన్ని మధ్యలో మూడు పర్యాయాలు పెంచారు. మొదటిసారి రూ.8,000, రెండోసారి రూ.12,000, మూడోసారి రూ.17,500గా ప్రభుత్వం పెంచి వేతనాలిచ్చింది. కాగా.. గతేడాది రూ.22,750లకు ప్రభుత్వం పెంచింది. దీంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆపరేటర్లు ఎంతో సంతోషించినా.. అది ఎంతో కాలం నిలవలేదు. ఎవరూ ఊహించని విధంగా ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలను రూ.22,7550 నుంచి రూ.19,500కు తగ్గించింది. ఉద్యోగుల వేతనాలు పెంచాల్సింది పోయి తగ్గించడమేమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు (ఫైల్)

కనీస వేతనం అందించాలని డిమాండ్.

మూడు మాసాల క్రితం గ్రీన్ చానల్ పద్ధతి ద్వారా వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి బ్యాంక్ అకౌంట్లను సేకరించింది. కానీ జిల్లా వ్యాప్తంగా ఆపరేటర్లకు టీజీ బీపాస్ ద్వారా ఒక నెల వేతనమే ఇచ్చారు. ఇంకా కొన్ని మండలాల్లో ఆపరేటర్లకు పెండింగ్ వేతనాలు అందాల్సి ఉంది. ఏ కార్యాలయంలోనైనా ఉద్యోగులు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం 5గంటలకు ఇంటికి వెళతారు. తమతో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ప్రజాపాలన దరఖాస్తులు, ఓటర్ల జాబితా, ఇతర సర్వేలు ఆన్‌లైన్ చేయిస్తూ.. ఒక్కోసారి అర్ధరాత్రి వరకు పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని రకాల పనులు చేస్తున్నా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి కనీస వేతనం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదని, క్రమం తప్పకుండా ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు కోరుతున్నారు. అలాగే హెల్త్‌కార్డులు అందించాలని కేంద్ర ప్రభుత్వ జీఓ ప్రకారం ప్రతి కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.28,000 జీతం ఇవ్వాలని కోరుతున్నారు.

వెంటనే క్రమబద్ధీకరించాలి..



మండల పరిషత్ కార్యాలయాల్లో పదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నాం. కనీస వేతనంతో పాటు సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెలనెలా వేతనాలు ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వ జీఓ ప్రకారం రూ.28,000 జీతం ఇవ్వాలి.

- సురేందర్, జిల్లా అధ్యక్షుడు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్

తగ్గించిన వేతనం పెంచాలి..



ఉద్యోగులకు ఎప్పుడైనా వేతనాలు పెంచి ఇవ్వడం ఆనవాయితీ. మాకు మాత్రం గతేడాది రూ.22,500ల జీతాన్ని తగ్గించి రూ.19,500 చెల్లిస్తున్నారు. తగ్గించిన వేతనాన్ని వెంటనే పెంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడా బకాయిలు అందజేయాలి.

- శ్రీను, కంప్యూటర్ ఆపరేటర్ మహబూబ్‌నగర్

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



తెలంగాణచౌరస్తాలో కార్మిక సంఘాల బైక్‌ర్యాలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సార్వత్రిక సమ్మెకు మద్దతుగా శనివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. అక్కడి నుంచి కొత్త బస్టాండు, న్యూటౌన్, జీజీహెచ్, మెట్టుగడ్డ మీదుగా బాయమ్మతోట, రాజేంద్రనగర్, పాత డీఈఓ కార్యాలయం, ఎర్రసత్యం విగ్రహం, తెలంగాణచౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు పరచాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వద్దని, 8 గంటల పనిని 12, 14 గంటలకు పెంచే విధానం ఉపసంహరించుకోవాలన్నారు. సకల కార్మికులందరికీ పని భద్రత, ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కిల్లె గోపాల్, ఖమర్‌అలీ, చంద్రకాంత్, రాంమోహన్, పృథ్వీసింగ్, గోపాల్‌నాయక్, దేవానంద్, యు.కృష్ణయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ అన్నింటికీ మూలం..



'ప్రతి ఒక్కరికి అమ్మే అన్నింటికీ మూలంగా వ్యవహరిస్తుంది. అన్నీ తామై చూసుకుంటుంది. మా అమ్మ ఎల్లమ్మ చిన్నప్పటి నుంచి కష్టపడుతూ మమ్మల్ని చదివించింది. 19 ఏళ్లుగా ఆర్మీలో దేశం కోసం పనిచేస్తున్నాను. దేశంలోని తల్లులందరి ఆనందం కోసం దేశ సేవ చేయడం ఆనందంగా ఉంది. అమ్మలందరికీ హ్యాపీ మదర్స్ డే.

– గంగపురం వెంకటయ్య, ఇండియన్ ఆర్మీ సైనికుడు, వెల్దండ

26 టాస్క్‌లు..

ఆధునిక అమ్మలపై ఎన్నో సర్వేలు జరిగాయి. ఇటీవల జరిగిన ఓ సర్వే అమ్మలకు ఉదయం లేచినప్పటి నుంచి దాదాపు 26 టాస్క్‌లు ఉంటాయని తేల్చింది. పిల్లలకు బ్రష్ చేయించడం, శుభ్రమైన దుస్తులు తొడగడం, అల్పాహారం అందించడం, బడికి పంపడం, ఇతరత్రా ఆరోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాల్సిన తేదీలను గుర్తు చేయడం.. అమ్మ గృహిణి అయినా.. ఉద్యోగం చేసినా పిల్లలకు రోజూ సుమారు 7 గంటల సమయం కేటాయిస్తుంది.

ఆదర్శమూర్తి.. అమ్మ

పాలమూరు: అమ్మ అనే పదం అద్భుతం.. ఎంత చెప్పినా తక్కువే.. ఆదర్శ మూర్తి, చైతన్య స్ఫూర్తి.. అమ్మను ఎంత తలచినా మధురమే. అనుబంధానికి, అనురాగానికి ఆమె వారధి, సారథి. తొలి అడుగులో తడబాటును.. బతుకు బాటలో పొరపాటును సరిదిద్దుతోంది. అందుకే అమ్మే నిత్య చైతన్యస్ఫూర్తి. జన్మనిచ్చినప్పటి నుంచి పెద్దయ్యే వరకు రక్షణ కవచంగా ఉంటూ ప్రపంచాన్ని చూపుతోంది. కన్న పిల్లల కోసం ఎన్ని బాధలైనా ఓర్చుకుంటారు. నేటి సమాజంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన పలువుర్ని పలకరిస్తే వారి రోల్ మోడల్ అమ్మే అంటారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..



■ ఉదయం లేస్తే ఉరుకుల పరుగుల జీవితం. నిమిషం వృథా చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేయాలి. ఆధునిక అమ్మల జీవన శైలిలో వేగం విపరీతంగా పెరిగింది. ఇంటి బాధ్యత అంతా ఆమెదే. పిల్లల కోసం స్కూటీ నేర్చుకోవాల్సి వస్తోంది. రోజూ హోం వర్క్ చేయించడం, సందేహాలు తీర్చడం ఆమె పనే. తెల్లవారుజామునే నిద్ర లేచి ఇంటి పనులు చకచక పూర్తి చేసుకొని పిల్లలను నిద్రలేపుతుంది. తొమ్మిదింటికల్లా బడికి పంపించి ఆమె ఉద్యోగానికి ఉరగెత్తాలి. తిరిగి సాయంత్రం ఇంటికొచ్చాక పిల్లలు అడిగిన రుచులన్నీ వండి పెట్టడానికి విసుక్కోదు. పిల్లలు అడిగిన కొత్త వంటకాల్ని టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లలో ఎలా తయారు చేయాలో చూసి నేర్చుకొని కమ్మగా వండి పెడుతోంది.

తొలి గురువు..

బిడ్డకు జన్మించినప్పటి నుంచి పెద్దయ్యే వరకు అమ్మ ఒక గురువులా వారికి ప్రపంచాన్ని చూపిస్తుంది. బాల్యంలో అన్ని విషయాలు బోధించేది అమ్మే. తల్లే తొలి గురువు. చందమామ రావే.. జాబిల్లి రావే అంటూ గోరుముద్దలు తినిపించే నాటి నుంచి పెద్దయ్యే వరకు తల్లులు పిల్లలకు ఎన్నో విషయాలు బోధిస్తారు. వారికి చెప్పడానికి కథలు నేర్చుకుంటారు. వారి కోసం తమ పంథా మార్చుకుంటారు. అమ్మ పెంపకాన్ని బట్టే పిల్లల ఎదుగుదల ఉంటుంది. పిల్లల ప్రతి దశలోనూ అమ్మ ప్రభావం ఉంటుంది.

ఇష్టాలు మార్చుకుంటూ..

అమ్మకు ఎర్రరంగు అంటే అస్సలు ఇష్టం ఉండదు.. కానీ కూతురికి అదే ఎక్కువ మక్కువ. షాపింగ్‌కు వెళ్లినప్పుడు అమ్మ ఆకుపచ్చ పట్టుచీర కొందామంటే కూతురు ఎర్ర పట్టు కొంటే బాగుంటుంది అనగానే తల్లి తన ఇష్టాన్ని మార్చుకుంది. అప్పుడు అమ్మ కళ్లకు ఎర్ర రంగు పట్టుచీర ఎంతో అందంగా కనిపిస్తుంది. ఇలా కట్టుకునే దుస్తుల నుంచి తినే తిండి వరకు అమ్మ తన ఇష్టాలను పక్కన పెట్టి పిల్లలు చెప్పిన దానికే ఓటు వేస్తుంది.

వెన్నంటి ఉండి నడిపించింది డీఎస్పీ మొగిలయ్య

గద్వాల: అమ్మకు నిర్వచనం చెప్పలేం. నా వరకు మా అమ్మ వెన్నంటి ఉండి ముందుకు నడిపించింది. మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మ పేరు రుక్కమ్మ, నాన్న భూమన్న. మేము మొత్తం ఐదుగురు సంతానం. ముగ్గురు అక్కలు, వారి తరువాత నేను, మా తమ్ముడు. మా సొంతూరు అప్పటి నిజామాబాద్ జిల్లా జుక్కల్ మండలం ఖండే బల్లూరు గ్రామం. నా స్కూల్ చదువు సొంతూరులో పూర్తి కాగా పదో తరగతి మద్నూరు, ఇంటర్మీడియట్ బిచ్కులకుందలో చదివాను. నిజామాబాద్‌లోని గిరిరాజ్ కాలేజీలో బీఏ పూర్తి చేసి పీజీ ఓయూలో చేశాను. బీఈడీ చేసి 1996లో స్కూల్ అసిస్టెంట్ జాబ్ వస్తే అందులో జాయిన్ అయ్యాను. అయితే పోలీసు జాబ్‌పై ఇష్టంతో ఇటువైపు వచ్చాను.

వ్యవసాయ పనులకు పోయి వచ్చిన తర్వాత మా అమ్మను నన్ను దగ్గర కూర్చోబెట్టుకొని చదివించేది. నేను టెన్త్ పరీక్ష రాసేటప్పుడు నా కోసం దేవాలయానికి వెళ్లి మొక్కుకుంది. నేను పరీక్ష రాసి బయటకు వచ్చిన తరువాత కూడ నా కోసం అక్కడే వేచి ఉండేది. ఈ ఘటన నా జీవితంలో మరిచిపోలేనిది. నా కోసం ఇంత కష్టపడే అమ్మకు ఏదైన సాధించాలనే తపనతో కష్టపడి చదివి పోలీస్ అయ్యాను. ప్రతి అమ్మకు సాక్షి దినపత్రిక తరపున మాతృదిన శుభాకాంక్షలు.



తల్లి రుక్కమ్మతో డీఎస్పీ మొగిలయ్య

కన్నీళ్లు దిగమింగుకొని.. కూతుళ్లను చదివించి..



కూతుళ్లు ఇంద్రజ, సింధూజతో తల్లి గీతమ్మ

అమరచింత: ఇంటికి పెద్ద దిక్కు అయిన భర్త 26 ఏళ్ల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందడంతో భార్యకి భవిష్యత్ అంతా అంధకారం అలుముకున్నట్లయ్యింది. కానీ, తమ ఇద్దరు పిల్లల కోసం కన్నీళ్లను దిగమింగుకొని ఆమె జీవితంలో ముందడుగు వేసింది. కుట్టుమిషన్‌తో ఉపాధి పొందుతూ.. ఇద్దరు అమ్మాయిలను ఉన్నత చదువులు చదివించి ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది అమరచింతకు చెందిన ఉప్పరి గీతమ్మ. వివరాల్లోకి వెళ్తే.. అమరచింతకి చెందిన ఉప్పరి ప్రభాకర్, గీతమ్మ భార్యభర్తలు. చిన్న, చిన్న కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. 1999వ సంవత్సరంలో ప్రభాకర్ ప్రమాదవశాస్తు మృతి చెందాడు. భర్త చనిపోయిన నాటికి గీతమ్మకు ఇద్దరు కూతుళ్లు.. 5 ఏళ్ల ఇంద్రజ, మూడేళ్ల సింధూజ ఉన్నారు. చిన్నతనంలో భర్తను కోల్పోయిన గీతమ్మ.. తన ఇద్దరు పిల్లల కోసం బాధనంతా తనలోనే దిగమింగుకొంది. తన ఇద్దరు కూతుళ్లకు ఉన్నత చదువులు.. భవిష్యత్ ఇవ్వాలనుకుంది. దీంతో కుట్టుమిషన్‌తో స్వయం ఉపాధి పొందడం ప్రారంభించింది. వచ్చిన చిన్నపాటి ఆదాయంతో అటు కుటుంబ పోషణ, ఇటు పిల్లలను చదివించింది. ప్రస్తుతం పెద్ద కూతురు ఇంద్రజ వెటర్నరీ కోర్సు పూర్తి చేసి.. వెటర్నరీ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. చిన్న కూతురు సింధూజ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుంది. పిల్లలిద్దరికి మంచి భవిష్యత్‌ను ఇవ్వడమే తన లక్ష్యమని.. ఎన్ని ఇబ్బందులు కలిగినా ముందుకు వెళ్లానని గీతమ్మ తెలిపింది.

అమ్మ కష్టం వృథా చెయ్యలేదు

అమ్మ కష్టం వృథా చెయ్యకుండా కష్టపడి చదివి వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాను. తనకు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడే నాన్న చనిపోవడంతో అమ్మే అన్నీ తానై తమను చూసుకుంది. ఆడపిల్లలంటేనే చిన్నచూపు చూసే ఈ రోజుల్లో తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా.. పురుషులతో సమానంగా అమ్మ తమను ఉన్నత చదువులు చదివించింది. అమ్మ కష్టం వృథా కాకుండా కష్టపడి చదివాం. ఉద్యోగం సాధించా. అమ్మను కంటికి రెప్పలా చూసుకుంటాం.

– ఇంద్రజ, అమరచింత

'కర్ణాటక వడ్లనే కొనుగోలు చేస్తుండ్రు'

- స్థానిక రైతుల ఆందోళన
- ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తాళం వేసిన అన్నదాతలు
- నిర్వాహకుల చేతివాటం



కొండాపురంలో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని ఐకేపీ సెంటర్‌కు తాళం వేసిన రైతులు

కేటీదొడ్డి: కర్ణాటక నుంచి వస్తున్న వడ్లను కొనుగోలు చేస్తూ స్థానిక రైతులకు మోసం చేస్తున్నారని శనివారం మండలంలోని కొండాపురం రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సన్నాలకు మద్దతు ధరతో పాటు బోనస్ ప్రకటించడంతో ఐకేపీ సెంటర్ నిర్వాహకులు అక్రమాలకు తెరలేపారని దుయ్యబట్టారు. 15 రోజుల నుంచి వడ్లను కల్లాలకే పరిమితం చేశారని, గోనె సంచులు లేవని సాకులు చెప్తూ కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి రాత్రికే సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం నుంచి కొండాపురం, వెంకటాపురం, ఈర్లబండ, కేటీదొడ్డి, ఎర్సందొడ్డి తదితర ప్రాంతాలకు చెందిన వడ్ల కొనుగోలు కేంద్రాలకు భారీ మొత్తంలో తెస్తుండడంతో వాటిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. కొండాపురంలో పండించిన వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ గ్రామ రైతులు ఐకేపీ సెంటర్‌కు తాళం వేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. దీనిపై ఏపీఎం గోపాల్ వివరణ కోరగా.. టోకెన్ ప్రకారం గన్నీ బ్యాగులు పంపిణీ చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



వీరమణి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తెలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని శేరిపల్లి (బి) వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. కడప నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న శివదర్శిని ప్రైవేట్ బస్సు మరమ్మతుకు గురైంది. బస్సు క్లీనర్ ప్రవీణ్ కుమార్ (43) వేరే చోట బస్సు డ్రైవర్‌గా పనిచేసే శ్రీహర్షకు విషయం చెప్పాడు. అతను భార్య వీరమణికి (38)కు చెప్పగా ఆమె గ్రామానికి చెందిన శివ కుమార్ ద్వారా బస్సును లాగడానికి ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొని బయలుదేరారు. బస్సును తాడుతో ట్రాక్టర్‌కు కట్టి భూత్పూర్ వైపునకు తీసుకొస్తుండగా తాడు తెగిపోయింది. ప్రవీణ్ కుమార్, వీరమణి మళ్లీ తాడును కట్టి లాగే క్రమంలో బస్సు సడెన్‌గా స్టార్ట్ అయి ప్రవీణ్ కుమార్, వీరమణితో పాటు ట్రాక్టర్‌ను ఢీకొట్టి ముందుకు వెళ్లింది. ట్రాక్టర్ బోల్తా పడగా వీరమణి, ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్‌కుమార్ సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ట్రావెల్ బస్సు డ్రైవర్ హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆటో ఇప్పించలేదని యువకుడి బలవన్మరణం



శివ (ఫైల్)

కొత్తకోట రూరల్: ఆటో కొనుక్కోవడానికి తండ్రి డబ్బులు ఇవ్వని కారణంగా మనస్తాపానికి గురైన ఓ కొడుకు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొత్తకోట మండలం అప్పరాలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. అప్పరాల గ్రామానికి చెందిన జంగాల కృష్ణమ్మ, జంగాల పుల్లన్న దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరి రెండో కుమారుడైన శివ(21) తనకు ప్యాసింజర్ ఆటో కావాలని తండ్రితో మొరపెట్టుకునేవాడు. పుల్లన్న ఇటీవలే కుమార్తె వివాహం చేయడంతో తన డబ్బులు లేవని లేవని చెప్పిన శివ వినిపించుకోలేదు. ఈనెల 9న మరోమారు తండ్రితో తనకు ఆటో ఇప్పిస్తావా? లేదా అని వాగ్వాదానికి దిగాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివ తిరిగి వచ్చి పురుగుల మందు తాగానని చెప్పడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివ శనివారం మృతి చెందాడు. తమ కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శరవేగంగా సాగుతున్న 'టర్ఫ్' పనులు



గ్రీనరీ ఏర్పాటుతో ఆకట్టుకుంటున్న ఎండీసీఏ మైదానం

- రూ.60 లక్షలతో పనులు ప్రారంభం
- త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం



మైదానం అంతా పచ్చని గడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: పై ఫొటోను చూస్తే ఒకప్పుడూ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు వేదిక అయిన ఎల్‌బీ స్టేడియమో, ఇప్పటి ఉప్పల్ స్టేడియంలా కనిపిస్తుందంటే మీరు పొరబడినట్లే. ఇది పాలమూరులోని ఎండీసీఏ క్రికెట్ మైదానం. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత హెచ్‌సీఏకు ఉన్న ఏకైక క్రీడా మైదానం. ఈ మైదానంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

అందుబాటులోకి గ్రీనరీ మైదానం...

ఉమ్మడి జిల్లాలోని క్రికెటర్ల కల త్వరలోనే నెరవేరబోతుంది. ఎండీసీఏ మైదానంలో మూడు టర్ఫ్ వికెట్‌లు అందుబాటులోకి తీసుకురానున్నారు. క్రికెట్‌లో టర్ఫ్ వికెట్ (పిచ్)కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. కేవలం మ్యాట్‌ల మీద క్రికెట్ ఆడే క్రీడాకారులకు టర్ఫ్ వికెట్‌పై ఆడాలంటే మెరుగైన ప్రాక్టీస్ అవసరం. అలాంటి టర్ఫ్ వికెట్ పిచ్‌లను ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది ఎండీసీఏ మైదానంలో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో పలువురు హెచ్‌సీఏ ప్రతినిధులు పాల్గొనగా మైదానంలో టర్ఫ్ వికెట్ ఏర్పాటు చేయాలని ఎండీసీఏ ప్రతినిధులు వారి దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు కావడంతో మైదానంలో టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీనర్ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మైదానంలో గ్రీనర్ ఏర్పాటు పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మైదానంలో వర్షపునీరు నిలువకుండా ఎత్తుపెంచి చుట్టూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నారు.

హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు



ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీనరీ ఏర్పాటు, అభివృద్ధి కోసం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ రూ.60 లక్షలు కేటాయించి పనులు చేయిస్తోంది. ఈ మైదానం అభివృద్ధి కోసం అన్ని విధాల సహకారం అందిస్తున్న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు. ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీనరీ ఏర్పాటు చేయాలనే కల నెరవేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. టర్ఫ్ వికెట్ ఏర్పాటైతే జిల్లా క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లా క్రికెటర్లు రంజీ, భారత జట్టుకు ఆడాలన్నదే తన లక్ష్యం.

– ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి

త్వరలో జాతీయస్థాయి టోర్నీ

మైదానంలో మూడు టర్ఫ్ వికెట్ పిచ్‌లు, గ్రీనరీ అందుబాటులోకి రానుండడంతో త్వరలో హెచ్‌సీఏ వారు ఇక్కడి మైదానంలో జాతీయస్థాయి హెచ్‌సీఏ టోర్నీ నిర్వహించనున్నట్లు సమాచారం. ఎండీసీఏ మైదానంలో అండర్-19 టోర్నీ లేదా అండర్-16 టోర్నీ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టోర్నీ జరిగి దేశంలోని వివిధ రాష్ట్రాల జట్లు వస్తే ఈ మైదానానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వస్తుంది. భవిష్యత్తులో రంజీ మ్యాచ్‌లకు కూడా ఎండీసీఏ మైదానం వేదిక అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

బీచుపల్లిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకం, వాస్తుపూజ హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణ, పల్లకీసేవ వంటి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా రాత్రి తెప్పతేరు కార్యక్రమాన్ని భక్తుల కోలాహం, మంగళవాయిద్యాలతో అర్చకులు అంగరంగ వైభవంగా చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

అడ్డాకుల: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువకుడు ఇంట్లో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన అడ్డాకుల మండలంలోని చౌడాయపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. చౌడాయపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్(22) చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. అదే గ్రామంలో ఉండే మేనత్త వద్ద పెరిగి పెద్దయ్యాడు. తండ్రి బాలస్వామి లేబర్ పనికి వలస వెళ్లాడు. ఈక్రమంలో వెంకటేష్ ఒక్కడే ఇంటి వద్ద ఉండేవాడు. ఇదిలా ఉండగా కొన్నాళ్ల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వెంకటేష్ ఇటీవల ఇళ్లు మూసుకుని ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో శుక్రవారం రాత్రి చుట్టు పక్కల వారు.. తలుపులు తెరిచి చూడగా వెంకటేష్ ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. రెండు, మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని స్థానికులు తెలిపారు. యువకుడి మేనత్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

కొల్లాపూర్ ఎస్‌బీఐలో షార్ట్‌సర్క్యూట్

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ)లో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. రాత్రి 7:30 గంటల సమయంలో బ్యాంకులో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే బ్యాంకు మేనేజర్‌కు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా బ్యాంకులో ఓ కుర్చీ మాత్రమే కాలిపోయిందని, ఎటువంటి ఆస్తినష్టం జరగలేదని బ్యాంకు అధికారులు తెలిపారు.

గంజాయి పట్టివేత: నిందితుల అరెస్ట్



జడ్చర్ల: అక్రమంగా దిగుమతి చేసుకున్న గంజాయిని చిన్న చిన్న పాకెట్లుగా మార్చి వినియోగదారులకు విక్రయిస్తున్న నిందితుడితో పాటు గంజాయి సరఫరా చేసిన మరొకరిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. బాలానగర్ మండలం మోతిఘనపూర్‌లో ధన్‌రాజ్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో శనివారం అతడి ఇంటిపై దాడులు నిర్వహించారు. ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 760 గ్రాముల గంజాయితో పాటు తూకం యంత్రం, మూడు మొబైల్ ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తంగా రూ.1.20 లక్షలుగా ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి గంజాయిని సరఫరా చేస్తున్న బిజ్జుసింగ్‌ను కూడా అరెస్ట్ చేసి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఇద్దరు రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వారుగా పేర్కొన్నారు.